క్లుప్తంగా

ఆలయంలో షూటింగ్..

ఇబ్బంది పడిన భక్తులు

మీర్‌పేట: సినిమా షూటింగ్‌తో ఆలయానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. మీర్‌పేట జిల్లెలగూడలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో మంగళవారం సినిమా షూటింగ్ జరిగింది. ఆలయానికి రూ.10వేలు చెల్లించి అనుమతి తీసుకున్న నిర్వాహకులు షూటింగ్ చేసే సమయంలో ఆలయ ప్రధాన గేటుకు తాళం వేశారు. దీంతో ఆలయానికి వచ్చిన భక్తులు కొంతసేపు బయటే వేచిఉన్నారు. భక్తులకు ఆలయ సిబ్బంది, అర్చకులు కూడా అందుబాటులో లేకపోవడంతో కొంతసేపు వరకు వేచి చూడాల్సి వచ్చింది. షూటింగ్ కారణంతో ప్రధాన ద్వారానికి తాళం వేయడంపై భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా, గేటుకు తాళం వేసిన విషయం తన దృష్టికి రాలేదని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగలేదని, రోజువారి పూజా కార్యక్రమాలు యథావిధిగా జరిగాయని తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నాలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

హుడాకాంప్లెక్స్: విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సరూర్‌నగర్ హుడాకాంప్లెక్స్‌లోని విద్యుత్ కార్యాలయం ఎదుట తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ హెచ్82 ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కార్మికుల 29 న్యాయమైన డిమాండ్లు, వాటి పరిష్కారం, పీఆర్సీని వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టిజన్ కార్మికులు ఉపేందర్, శ్రీకాంత్‌రెడ్డి, పెద్దులు, శివారెడ్డి, రాజు, ప్రవీణ్, హరీశ్వర్‌రెడ్డి, మహేందర్‌రావు పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెత్త కాల్చివేత



హస్తినాపురం షిరిడీ సాయినగర్ కాలనీలో కాలుతున్న చెత్త

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ అధ్వానంగా తయారైంది. పలు కాలనీలలో రోడ్ల వెంబడి చెత్త కుప్పలు పేరుకు పోతున్నాయి. చెత్తను సకాలంలో డంపింగ్ యార్డుకు తరలించాల్సిన సిబ్బంది ఆయా చెత్తకుప్పలకు నిప్పు పెడుతూ కాలనీలలో పొగబెడుతున్నారు. చెత్తను యథేచ్ఛగా కాలుస్తుండటంతో కాలనీలలో కాలుష్యం పెరిగిపోతుందంటూ ప్రజలు వాపోతున్నారు. చెత్తను కాల్చకుండా చూడాల్సిన శానిటేషన్ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదంటూ వివిధ కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్తను కాల్చడం వల్ల వచ్చే పొగ, కాలుష్యంతో తాము ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్మికులు చెత్తను కాల్చకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రూ.కోటి వరకు పంట రుణాలు

పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా

ఆమనగల్లు: ఆమనగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా ఈ ఏడాది రైతులకు రూ.కోటి వరకు పంట రుణాలు ఇవ్వాలనే లక్ష్యంగా నిర్ణయించినట్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా చెప్పారు. రుణాలను సకాలంలో చెల్లించి రాయితీ పొందాలని ఆయన సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సంఘం బలోపేతం, రైతులకు పంట రుణాలు, రుణాల రికవరీ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం గంప వెంకటేశ్‌గుప్తా మాట్లాడుతూ.. ఈ ఏడాది రైతులకు రూ.కోటి వరకు పంట రుణాలు అందించాలని లక్ష్యం కాగా ఇప్పటికే రూ.30 లక్షల రుణాలు రైతులకు అందించినట్లు చెప్పారు. రైతులు రుణాల కోసం దళారులను ఆశ్రయించకుండా నేరుగా పీఏసీఎస్‌లో సంప్రదించాలని, అర్హులైన వారందరికీ రుణాలు అందిస్తామని ఆయన వివరించారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా మరికొంతమంది రైతులకు రుణాలు అందించడానికి వీలుంటుందని ఆయన చెప్పారు. రైతులు తీసుకున్న రుణాలను ఈనెల 28లోపు రుణాలు చెల్లించే రైతులకు రాయితీ వలన కేవలం 4 శాతం వడ్డీ పడుతుందని ఆ తర్వాత చెల్లిస్తే 13శాతం వడ్డీ పడుతుందని తెలిపారు. మార్చి 31వ తేదీలోపు పాత బకాయిలు చెల్లించడానికి అవకాశం కల్పించినట్లు చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, డైరెక్టర్లు జోగు వీరయ్య, చేగూరి వెంకటేశ్, దోళ్యనాయక్, వెంకట్‌రెడ్డి, చెన్నమ్మ, జంగమ్మ, సీఈఓ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు రావు.. బిల్లు మాత్రం వస్తుంది

- కార్పొరేషన్లో నీటి సరఫరా, మరమ్మతుల్లో అలసత్వం
- మీటర్లు బిగించకుండానే రూ.వేలల్లో బిల్లులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్, జలమండలి అధికారులు

బడంగ్‌పేట్: మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి ఉచిత తాగునీరు అందిస్తామని ప్రభుత్వం ఓవైపు చెబుతోంది. అందులో భాగంగా సుదూర ప్రాంతాలనుంచి భారీ పైప్‌లైన్లు వేసి శివారు ప్రాంతాలకు తరలించి మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో నిర్మించిన పెద్దవాటర్ ట్యాంకుల్లో నీరు నిల్వచేసి కాలనీల్లో తాగునీరు అందించే ప్రయత్నం చేస్తోంది. అయితే జలమండలిలో ఉన్న లోపభూయిష్ట లోపమో లేక అధికారుల, కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యమో కానీ.. మెజార్టీ ప్రజలకు తాగునీటి సరఫరా కాకపోవడంతో పాటు, కనెక్షన్లు ఇచ్చినవారికి మాత్రం నీటిబిల్లుల మోత తప్పడంలేదు.

మాకు సంబంధం లేదు..

బడంగ్‌పేట కార్పొరేషన్‌లో నీటి సరఫరాను హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ సివరేజ్ బోర్డుకు అప్పగించారు. ఇక అప్పటినుంచి కార్పొరేషన్ పరిధిలో నివాసం ఉంటున్న ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. నీటి సరఫరా హెచ్‌ఎండబ్ల్యూఎస్ బోర్డుకు వెళ్లడంతో కార్పొరేషన్ అధికారులు కొత్త నల్లా కనెక్షన్ ఇవ్వడానికి వీలు లేకుండా పోయింది. వాటర్ పైపులు పగిలిపోయినా, నీళ్లు రాకపోయినా మాకు సంబంధం లేదంటూ కార్పొరేషన్ అధికారులు దాటవేస్తున్నారు. ఇకపోతే జలమండలిలో కలిసిపోయినందున ప్రస్తుతం ఉన్న నల్లా కనెక్షన్లు రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని, పాత నల్లా కనెక్షన్లు ఉన్నవారికి చెబుతున్నారు.



అల్మాస్‌గూడలోని వాటర్ వర్క్స్ సివరేజీ బోర్డు కార్యాలయం

పైప్‌లైన్లకు దగ్గరుంటే ఓ రేటు..

మున్సిపాలిటీల్లో నల్లా కనెక్షన్లు ఉన్నవారు ఎన్‌ఓసీ సర్టిఫికెట్ తెచ్చుకోవాలని జలమండలి అధికారులు నిబంధనలు విధిస్తున్నారు. లేకపోతే కొత్త నల్లా కనెక్షన్ కావాలంటే మీసేవలో దరఖాస్తు చేసుకుంటే జలమండలి అధికారులు వచ్చి, కొలతలు వేసి పైప్‌లైన్‌కు దగ్గరగా ఉంటే ఓ రేటు, దూరంగా ఉంటే మరో రేటు చెబుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉచిత నల్లా కనెక్షన్లు ఏమో కానీ చేసిన కష్టం అంతా నల్లా బిల్లులు కట్టేందుకే సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త కనెక్షన్లకు మరో రూ.10వేలు, పైప్‌లైన్లు దూరం ఉంటే కార్పొరేషన్ అధికారుల చేత వాటర్ పైప్‌లైన్లు వేయించుకుంటేనే కనెక్షన్ ఇస్తామని వాటర్‌వర్క్స్ అధికారులు మెలిక పెట్టడంతో ప్రజలు తికమక పడుతున్నారు. ఒక కాలనీలో సుమారు 100 ఇళ్లు ఉంటే ఇప్పటిదాకా లీగల్‌గా క్యాన్ నంబర్లు పొందినవారు సుమారు 10 నుంచి 15 ఇళ్లు మాత్రమే ఉన్నాయి. నల్లాబిల్లులు కట్టినవారికి మాత్రమే క్యాన్ నంబర్లు ఇచ్చి అటు తర్వాత రూ.వేలు బిల్లులు బకాయి ఉన్నారని ఫోన్‌లకు మెసేజ్ సెండ్ చేస్తున్నారు. మరి నల్లా కనెక్షన్‌లు ఉన్నా కట్టనివారి సంగతి గురించి మాత్రం అధికారులు చేతులెత్తేస్తున్నారు.

మీటర్లు బిగించకుండా బిల్లులెలా వేస్తారు..

ఒక్క ఇంటికీ వాటర్ మీటర్లు బిగించిన దాఖలాలు లేవు. అలాంటప్పుడు ఎంత మోతాదులో నీటిని వాడుకుంటున్నారో తెలియక ముందే భారీగా నల్లా బిల్లులు ఎలా వేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇళ్లకు రెసిడెన్షియల్ నల్లా కనెక్షన్లు, కొద్దిపాటి షటర్(దుకాణం)ఉన్నా కమర్షియల్ నల్లా కనెక్షన్లు ఇస్తుండటంతో వినియోగదారులు విస్తుపోతున్నారు. ఇకనైనా జలమండలి అధికారులు అప్రమత్తమై అన్ని కాలనీల్లో అవగహన సదస్సులు ఏర్పాటు చేసి అందరికీ న్యాయ రీతిలో నల్లా బిల్లులు వసూలుతోపాటు క్యాన్ నంబర్ ఇవ్వని వారికి నంబర్ ఇచ్చి, నీటి బిల్లుల మిషన్‌లు బిగించి, నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.

ఉచిత తాగునీరు పథకం ఏమైంది?

మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి ఉచిత తాగునీరు అందిస్తున్నామని చెబుతున్న అధికారులు, పాలకులు ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇంటి ట్యాక్సుల కంటే నల్లా బిల్లుల మోత ఎక్కువగా ఉందని వాపోతున్నారు. వేలల్లో బిల్లులు వసూలు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. క్యాన్ నంబర్ తీసుకుంటే బిల్లుల బాదుడు, క్యాన్ నంబర్ తీసుకోకపోతే అక్రమ నల్లా కనెక్షన్ కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. ఇదెక్కడి న్యాయమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి ఉచిత తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారుల తప్పిదమే



కార్పొరేషన్ పరిధిలోని ఏ డివిజన్‌కు, ఏ కాలనీలకు వెళ్లినా కృష్ణా నీరు రావడం లేదని, వేల రూపాయల వాటర్ బిల్లులు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయాన్ని వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి గతంలో తీసుకెళ్లాం. ప్రజలకు అవగాహన కల్పించి సక్రమంగా అందరికి తాగునీరు సరఫరా చేయాలని జలమండలి మేనేజర్‌ను కలిసి విన్నవించాం. అన్ని కాలనీల్లో పర్యటించి అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకూ ఎలాంటి స్పందన లేదు. అందరికీ తాగునీరు అందించేందుకు, వాటర్ బిల్లుల తగ్గింపుకోసం అవసరమైతే పోరాటం చేస్తాం.

– చిగురింత పారిజాత, మేయర్, బడంగ్‌పేట

బాలల పరిరక్షణ అందరి బాధ్యత

చిన్నారులతో స్నేహంగా మెలగండి: సర్పంచ్

కందుకూరు: బాలల పరిరక్షణ అందరి బాధ్యత అని గూడూరు సర్పంచ్ పోలెమోని శ్రీలత అన్నారు. బుధవారం మండల పరిధిలోని గూడూరు అంగన్‌వాడీ కేంద్రంలో బాలల పరిరక్షణ, ఆరోగ్యలక్ష్మిపై నిర్వహించిన సమీక్షలో చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్‌కు బంగారు బాట వేసేలా వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు. వారితో ప్రేమగా, స్నేహంగా ఉండాలని, అప్పుడే పిల్లలు తల్లిదండ్రులకు అన్ని విషయాలు చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు లలిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సబిత, పారా, హెచ్‌ఆర్‌సీ జిల్లా ఆర్గనైజర్ కొమ్ము తిరుపతి, యూత్ నాయకుడు కొర్వి సురేందర్, పంచాయతీ కార్యదర్శి ఎస్‌డీ జానిమియా, ప్రధానోపాధ్యాయులు రమేష్‌కుమార్, అనిత, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, రాధిక, నిర్మల, ఆశ వర్కర్ వినోద, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సర్పంచ్ తదితరులు

కుక్కల బెడద నుంచి కాపాడండి

పహాడీషరీఫ్: వీధి కుక్కల బెడద లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ బారి కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మున్సిపల్ కమిషనర్ ఎస్.వసంతకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. షాహీన్‌నగర్‌లో కుక్కలు స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, బాటసారులపై మూకుమ్మడిగా దాడి చేసి గాయపరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎంతో మంది చిన్నారులు కుక్కకాటు బారిన పడ్డారని వాపోయారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు భయపడుతున్నారని చెప్పారు. రోడ్లపైకి అకస్మాత్తుగా శునకాలు వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను తరలించాలని కోరారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు అబ్దుల్ బారి

ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

- 'కంటివెలుగు'ను వినియోగించుకోండి
- ఎంపీపీ రఘుమారెడ్డి



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

మహేశ్వరం: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ఎంపీడీఓ, సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, వైద్యులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కంటి సమస్యతో బాధపడుతున్న వారు నేత్ర శిబిరంలో పరీక్ష చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య తెలంగాణే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అని.. అంధత్వం లేని రాష్ట్రం కోసమే కంటివెలుగు చేపట్టారని తెలిపారు. అవసరమైన వారికి కంటి పరీక్ష, అద్దాలు పంపిణీ చేసి, శస్త్రచికిత్స చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నర్సింహ, సర్పంచి బస్వ శ్రీశైలం గౌడ్, ఉప సర్పంచ్ పోతుల నర్సింగ్, ఎంపీటీసీ కుమారి రాయప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవవరం గౌడ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శి చక్రధర్‌గౌడ్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాధానం దీటుగా ఉంటుంది

- ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే సహించేది లేదు
- బీజేపీ దళితమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రవణ్‌కుమార్



శివాజీ విగ్రహం వద్ద మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మీర్‌పేట: బీజేపీ నాయకులపై ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని, బీఆర్‌ఎస్ నాయకులకూ అదే విధంగా సమాధానం చెప్పాల్సి వస్తుందని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రవణ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మీర్‌పేట శివాజీనగర్ కాలనీలోని శివాజీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లో విమర్శకు ప్రతి విమర్శలు ఉంటాయని, విమర్శ సంస్కారవంతంగా ఉండాలని, కానీ బీఆర్‌ఎస్ నాయకులు కామేష్ రెడ్డి.. బీజేపీ రాష్ట్ర నాయకులు అందెల శ్రీరాములు యాదవ్‌పై ఏక వచనంతో వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేయడాన్ని తప్పుబట్టారు. యువతకు స్ఫూర్తిదాయకమైన ఛత్రపతి శివాజీ చరిత్ర, గొప్పతనం తెలియని బీఆర్‌ఎస్ నాయకులు చెత్త వేసే చోట విగ్రహాన్ని ఏర్పాటు చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని ఆరోపించారు. అంతకు ముందు శివాజీ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూల మాల వేశారు. సమావేశంలో కార్పొరేటర్ నీలారవి నాయక్, యువమోర్చా అధ్యక్షుడు ముఖేష్‌యాదవ్, నాయకులు రాజశేఖర్, శ్రీను, తిరుపతిరెడ్డి, కాశీరాం, ఓర్సు స్వామికుమార్, విక్కిసాగర్, రాఘవేంద్రగౌడ్, నర్సింహ్మారెడ్డి, శశికాంత్, జగన్, గోపి, శివ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్‌ఎస్

బంగారు తెలంగాణ పేరుతో రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పుల పాలు చేసిందని బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ సుధాకర్‌శర్మ ఆరోపించారు. సోమవారం రాత్రి మీర్‌పేట కార్పొరేషన్ పరిధి బీజేపీ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన శక్తి కేంద్రం కార్నర్ సమావేశానికి సుధాకర్‌శర్మ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ప్రజల కోసం ఆయుష్మాన్‌భారత్‌తో పాటు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో రూ.4 లక్షల 33 వేల కోట్లు అప్పు చేసిందే తప్ప చేసిన అభివృద్ధి ఏమీలేదని విమర్శించారు. శివారు మున్సిపాలిటీల్లోని వీకర్‌సెక్షన్‌లలో జీహెచ్‌ఎంసీ కంటే అధికంగా ఇంటి పన్నులు, నల్లా బిల్లులు వసూలు చేస్తూ ప్రజలపై అదనపు భారం వేస్తున్నారని, వెంటనే వీటిని రద్దు చేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి

పహాడీషరీఫ్: జల్‌పల్లి గ్రామంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలో బుధవారం పర్యటించిన ఆయన.. స్థానికంగా నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ.. జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లే రూట్‌లోని దేవాలయం పక్కన చాలా రోజులుగా డ్రైనేజీ పారుతుండడంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. అపరిశుభ్రత కారణంగా దోమలు పెరిగి.. చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన చెందారు. జల్‌పల్లిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో మంత్రి సబితారెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే.. మంత్రి ఇంటిని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గౌరిగె మల్లేశ్, దిలీప్, హరికృష్ణ, శ్రీకాంత్ గౌడ్, మురళీ, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై స్థానికులతో మాట్లాడుతున్న శ్రీరాములు యాదవ్

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. బుధవారం భూపేశ్‌గుప్తానగర్ కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి కార్పొరేటర్ కాలనీలో మార్నింగ్ వాక్ చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని, కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలని కోరారు. స్పందించిన కార్పొరేటర్ సుజాతనాయక్ అన్ని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వేణుగోపాలచారి, జిలాని, యూనిస్, వహీద్, రమేశ్‌బాబు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడులు చేస్తే సహించం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత



కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బడంగ్‌పేట్: కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల జోలికొస్తే చూస్తూ ఊరుకోబోమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత అధికార పార్టీ నాయకులను హెచ్చరించారు. బుధవారం వరంగల్ జిల్లాలో యూత్ కాంగ్రెస్ నాయకులు తోట పవన్‌పై జరిగిన దాడికి నిరసనగా బడంగ్‌పేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పారిజాత మాట్లాడుతూ.. ప్రజావ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు ఇతర పార్టీల నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తూ వారిపై దాడులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకుడిపై దాడికి పాల్పడిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ అనుచరులు చేసిన దాడికి బాధ్యత వహించి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలన్నారు. దాడులకు పాల్పడితే ప్రజలు తిరగబడి గద్దెదింపడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పి.సుదర్శన్‌రెడ్డి, రాళ్లగూడెం సంతోషి, బండారి మనోహర్, బాలునాయక్, పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు పెద్దబావి వెంకట్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు అమృతనాయుడు, సుభాన్ యాదవ్, రంజిత్, సీనియర్ నాయకులు తదితరులున్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: కంటి సమస్యలతో బాధపడేవారు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని అన్నారు. వైద్యులే గ్రామాల్లోకి వచ్చి అత్యాధునిక పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయించేందుకు రిఫర్ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, ఉప సర్పంచ్ రామకృష్ణ, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లాయక్‌అలీ, శ్రీనివాస్‌గుప్త, సర్పంచ్ తులసీరాం, వార్డు సభ్యులు, నాయకులు నర్సింహ, నరేందర్‌రెడ్డి, మల్లయ్య, భిక్షపతి, మహేశ్, రాంచందర్, భాస్కర్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, వైద్యులు కిరణ్‌కుమార్, హెచ్‌ఈఓ సుధీర్, సిబ్బంది ఉన్నారు.



మహిళకు కళ్లద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

పోలెపల్లి గ్రామంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలో కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. మండల పరిధిలోని పోలెపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కంటివెలుగు శిబిరంలో 118 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బల్‌రాం, ఉపసర్పంచ్ అంజన్‌రెడ్డి, ఎంపీటీసీ కుమార్, డాక్టర్లు పరీక్షిత్ నరేందర్, మంజులాదేవి, సిబ్బంది తిరుపతిరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

386 మందికి పరీక్ష..

తలకొండపల్లి: మండల పరిధిలోని చౌదర్‌పల్లి, హర్యానాయక్‌తండాలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరంలో బుధవారం 386 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు కల్పన, స్నేహ, సైదమ్మ, మల్లికార్జున్, హెచ్‌ఏ మల్లయ్య, రామచంద్రయ్య, నర్సింహ, రవి కుమార్, శివకుమార్, నాగమల్లీశ్వరి ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి 200 పథకాలు

- కేంద్ర ప్రభుత్వ స్కీములను అడ్డుకుంటున్న రాష్ట్రం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

మహేశ్వరం: పేద ప్రజల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్రమోదీ దాదాపు 200ల పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తెలిపారు. బుధవారం పెండ్యాల గ్రామంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి బుగ్గని శంకర్, డబిల్‌గూడ సర్పంచ్, బూత్ అధ్యక్షుడు దాసరి సుదర్శన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ముఖ్య అతిథిగా నర్సింహ్మారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆయుష్మాన్‌భారత్, మధ్యాహ్న భోజనం, ఉచిత రేషన్, రైతులకు కిసాన్ సమ్మాన్‌నిధి, అంగన్‌వాడి కేంద్రాలకు పోషణ అభియాన్ కింద పౌష్టికాహారం ఇలా ఎన్నో పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని చెప్పారు. ఇలాంటి ఉపయోగకర పథకాలను రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అడ్డుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. దీంతో పాటు ఎన్‌ఆర్‌జీఎస్ ఫండ్స్ కింద కేంద్రం నేరుగా పంచాయతీలకు నిధులు విడుదల చేస్తోందని, పెండ్యాల గ్రామానికి రూ.40 లక్షలు మంజూరు చేయగా సీసీరోడ్లు, 14,15 ఆర్థిక సంఘం నిధులను శ్మశానవాటిక, డంపింగ్‌యార్డుకి రూ.15 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యదీశ్, చేవెళ్ల పార్లమెంటు సహ ఇన్‌చార్జి కాసుల అనంతయ్యగౌడ్, మండల అధ్యక్షుడు సిద్దోజు మాధవచారి, నాయకులు కుండేకుమార్, మంత్రి ముత్యం, అయిల్లా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి